క్లుప్తంగా

దర్గాలో ఉత్సవాలు



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలోని సయ్యద్ యాకూబ్ షావలీ బాబా దర్గాలో శుక్రవారం నిర్వహించిన ఉర్సు ఉత్సవాలకు స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించారు. దీపారాధన, మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో షరీఫ్, రహీం, ఫారూఖీ, తదితరులు పాల్గొన్నారు.

గవాస్కర్‌కు డాక్టరేట్



దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన గజ్జి సునీల్ గవాస్కర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సంస్కృతి విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న గవాస్కర్ 'జీవంధర చంపుకావ్య' అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ముక్తావాణి పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేసి పరిశోధన పత్రం సమర్పించగా డాక్టరేట్ ప్రకటించారు. యూనివర్సిటీ సంస్కృత విభాగాధిపతి విద్యారణ్య ఆర్య, రిటైర్డ్ ప్రొఫెసర్లు నీలకంఠం, రాములు గవాస్కర్‌ను అభినందించారు.

సన్మానం



నల్లబెల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పరకాలకు బదిలీ అయిన ఆకుల రవీందర్‌ను స్థానిక ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించడంలో రవీందర్‌ను నేర్పరిగా అభివర్ణించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సహకారం అందించే వారని గుర్తుచేశారు. అనంతరం రవీందర్ మాట్లాడారు. నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో పని చేయడం తనకు తృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు సాయిలు, ప్రభాకర్, కానిస్టేబుళ్లు వేణు, రాకేశ్, బాలు, శ్రవణ్‌కుమార్, పూర్ణచందర్, స్వర్ణలత, మున్నూరు కాపు సంఘం మండల కోఆర్డినేటర్ మేడిపల్లి సుధాకర్, మండల అధ్యక్షుడు కస్తూరి రవీందర్, కార్యదర్శి కొలగాని రామారావు, జిల్లా కమిటీ సభ్యులు ఆకుల మధు, ఆకుల సాంబరావు, జంగిలి శంకరయ్య, ఐతమ్ నాగరాజు, కొలగాని లక్ష్మయ్య, తోట రత్నాకర్, జంగిలి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

దంపతులకు..



గీసుకొండ : మండలంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 వేల 116 అందించిన స్థానిక వైద్యుడు తుప్పరి నర్సింహస్వామి, దేవిక దంపతులను గుట్టపై ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి దేవిక–నర్సింహస్వామి దంపతులు స్వామివారి జాతర సందర్భంగా సాయం అందించారని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

గీసుకొండ : పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నందనాయక్‌తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. నందనాయక్ తండాకు చెందిన బాదావత్ రమణి (59) శుక్రవారం ఉదయం తన కుమారుడు స్వామిని డబ్బులు అడిగింది. ఆతడు ఇవ్వకపోవడంతో మనస్థాపం చెంది ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను బంధువులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

21న వేలం

గీసుకొండ: మండలంలోని కొమ్మాలలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర నేపథ్యంలో పలు వ్యాపారాలకు సంబంధించి ఈనెల 21న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయల అమ్మకానికి రూ.లక్ష, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.50 వేలు, తలనీలాల సేకరణకు రూ.20 వేలు, పుట్నాలు, పేలాల అమ్మకానికి రూ.20 వేలను డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఈనెల 20 వరకు వేలం పాటల షెడ్యూల్ పొందాలని, ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.

గుడుంబాపై ఉక్కుపాదం

- ప్రత్యేక బృందాలతో దాడులు
- తొలుత బైండోవర్లు.. అనంతరం 'పీడీ'
- వందలాదిగా కేసులు, అరెస్టులు



చక్కెర పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నర్సంపేట : గుడుంబా తయారీపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మండలాల్లో స్థానిక పోలీసుల సహకారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, వరంగల్ అర్బన్ డీటీఎఫ్ బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. నాటుసారా తయారీ, రవాణాదారులతోపాటు ముడి సరుకుల అమ్మకందార్లపైనా ఉక్కుపాదం మోపుతున్నారు. నాటుసారా నేరాల్లో పట్టుబడిని వారిని తొలుత బైండోవర్ చేస్తున్నారు. మళ్లీ అదే నేరానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ అప్పటికీ మారని వారిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తున్నారు. నర్సంపేట ఎక్సైజ్ పరిధిలో 2024లో నాటుసారాకు సంబంధించి మొత్తం 756 కేసులు నమోదు చేసి 611 మందిని అరెస్టు చేశారు. అలాగే 5506 లీటర్ల సారా, 11 వేల 341 కేజీల నల్లబెల్లం, 2 వేల 30 కేజీల పటికతోపాటు 123 వాహనాలను స్వాధీనం చేసుకొని 368 మందిని బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన 23 మంది నుంచి రూ.11 లక్షల 40 వేల జరిమానా వసూలు చేయగా ఒకరిపై పీడీ యాక్టు నమోదు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

చెరువు ముందు తండాలో..

నెక్కొండ : మండలంలోని చెరువుముందు తండాలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు చేసినట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా 2 వేల 400 లీటర్ల చక్కెర పానకాన్ని, 30 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేయడంతోపాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

నిందితులపై కఠిన చర్యలు



నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు. మొదటి సారి బైండోవర్ చేస్తున్నాం. తిరిగి నేరానికి పాల్పడితే కేసులు పెడుతాం. అయినా మారకపోతే నిందితులపై పీడీ చట్టం ప్రయోగిస్తాం. నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వ్యాపారస్తులు నాటుసారా తయారీకి అవసరమైన ముడిసరుకుల విక్రయాన్ని మానుకోవాలి. లేనిపక్షంలో వారిపైనా కఠిన చర్యలు తప్పవు.

– రొండ్ల నరేశ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, నర్సంపేట

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సంగెం : చలికాలం నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మెడికేర్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. మండలంలోని తిమ్మాపూర్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు చిన్నపాక రాములు, రాకేశ్ ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వంశి, రాము, సాయితేజ, మేఘన, పుష్పనీల 235 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సుమారు రూ.72 వేల విలువైన మందులు ఉచితంగా పంపిణి చేశారు. డాక్టర్లు వంశీ, రాము, సాయి తేజ, మేఘన, పుష్పనీల 235 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి రూ.72 వేల విలువైన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బుక్క మల్లయ్య, వేల్పుల కుమారస్వామి, మాదినేని రాంరెడ్డి, గన్ను సంపత్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, యూత్ సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కల్లెడ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పర్వతగిరి: మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం 44వ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో వరంగల్ జిల్లా నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఆర్‌డీఎఫ్ అకాడమీ నుంచి రికర్వ్ విభాగంలో బి.గంగరాజు, సీహెచ్.త్రిశూల్, బి.భరత్, పి.అరవింద్, ఎ.వెంకటేశ్, పి.విజయలక్ష్మి, ఎం.స్ఫూర్తి, ఇండియన్ రౌండ్ కేటగిరిలో బి.ఆదర్శ్, బి.వినయ్, ఎస్.రామ్‌చరణ్, బి.మోహన్, బి.అశ్వత్, జి.అవినాష్, బి.మానస, ఎ.ప్రసన్న, బి.త్రినయని పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్ కొల్లూరులో ఈనెల 19వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ రేణుమండల్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అంగన్‌వాడీల్లో టీకాలు, పరీక్షలు తప్పనిసరి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ


నర్సంపేట రూరల్ : అంగన్ వాడీ సెంటర్లలో గర్భిణులు, కిశోర బాలలకు ప్రతీనెల క్రమం తప్పకుండా టీకాలు వేసేలా చూస్తూ, ప్రభుత్వం అందిస్తున్న టార్గెట్‌ను పూర్తిచేయాలని నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల, లక్నెపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించే క్యాంప్‌ను ఏఎన్‌ఎం, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విజయవంతం చేయాలన్నారు. అనంతరం పల్లెదవాఖానా తనిఖీ చేసి రిజిస్ట్రర్లను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్

సంగెం : ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా మరింత పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శన సందర్భంగా వారు మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ×వేల గొంతులు–లక్షల డప్పుల మహా ప్రదర్శన×ను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 20న హన్మకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించనున్న డప్పు కళాకారుల ప్రదర్శనకు మాదిగ ప్రజలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు దామెర కిషోర్, ప్రధాన కార్యదర్శి రాజు, కార్యదర్శి కొలకనూరి రవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే తనయుడి చేయూత



చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్‌కు చెందిన మంతెన సన్నీ ఏపీకి చెందిన తాడేపల్లిగూడెంలోని నిట్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సన్నీ తండ్రి ప్రభుదాస్ పేదరికంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే స్పందించి తన కుమారుడు అవియుక్త్‌రెడ్డితో రూ.55 వేల 990 విలువైన ల్యాప్‌టాప్‌ను సన్నీకి ఇప్పించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ రాజేందర్, నాయకులు మేఘ్యానాయక్, కొర్ర మోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి..

నర్సంపేట : పట్టణానికి చెందిన దివ్యాంగుడు రాజేందర్‌కు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు అవియుక్త్ రెడ్డి శుక్రవారం రూ.12 వేల సాయం అందజేశారు. పీజీ చదువుతున్న రాజేందర్ ఆర్థిక, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న అవియుక్త్ స్పందించాడు. తండ్రి సూచన మేరకు రాజేందర్‌కు నగదు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

'చలో మానుకోటను విజయవంతం చేయండి'

రాయపర్తి : ఈనెల 19న మానుకోటలో నిర్వహించనున్న చలో మానుకోట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మందాటి సుదర్శన్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని అంగడి ప్రాంతంలో సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల శ్యాంసుందర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యమకారులు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు సుదగాని వెంకటేశ్వర్లు, హపావత్ పంతులు, నాగండ్ల భాస్కర్, తేజావత్ సంతోశ్, వలబోజు హరిప్రసాద్, మూనావత్ లక్ష్మణ్, రాజమల్లు, దురిశెట్టి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్ధన్నపేట/నల్లబెల్లి : వర్ధన్నపేటలో నేడు (శనివారం) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, నల్లబెల్లి మండలంలోని నల్లబెల్లి, నందిగామ, రంగాపురం, మేడపల్లి, మూడుచెక్కలపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత ఏఈలు తరుణ్, హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ విమర్శలు'

నర్సంపేట : రాజకీయ దురుద్దేశంతోనే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై బీఆర్‌ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. గతంలో తెచ్చిన నిధులతో ఎమ్మెల్యే మాధవరెడ్డి అభివృద్ధి పనులు చేస్తున్నాడని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిధులను దుర్వినియోగం చేసి అభివృద్ధి విస్మరించారని సుదర్శన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు, బీఆర్‌ఎస్ నాయకులకు పట్టణ అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పేరుతో ధ్వంసం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో పూర్తి చేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



దుగ్గొండి : సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్



సంగెంలో..

ఊరూరా అర్హుల ఎంపిక సర్వే

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని దుగ్గొండి, సంగెం, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే శుక్రవారం కొనసాగింది. అధికారులు బృందాలుగా సర్వే నిర్వహించగా తహసీల్దార్లు రవిచంద్రారెడ్డి, రాజ్‌కుమార్, ఫణికుమార్, వెంకటస్వామి, ఎంపీడీఓలు అరుంధతి, రవీందర్, శ్రీవాణి పర్యవేక్షించి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుకు అర్హుల గుర్తింపు కోసం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని బృందాలకు సూచించారు. సర్వేకు వచ్చే ఉద్యోగులకు పూర్తి సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు. సర్వే అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు.



చెన్నారావుపేట : పాత మగ్దుంపురంలో..



పర్వతగిరిలో..

'సఖి' సేవలపై అవగాహన పెంచుకోవాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తిరుమల, స్వప్న, తదితరులు

- కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న

సంగెం : బాధిత మహిళలకు, బాలికలకు సఖి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన పెంచుకోవాలని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న కోరారు. మండలంలోని గవిచర్ల, లోహిత గ్రామాల్లో గ్రామైక్య సంఘాల సభ్యులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలను నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న బాలికలు, మహిళల రక్షణ కోసం సఖి కేంద్రం ఆధ్వర్యంలో పలు రకాల సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు సఖి కేంద్రంలో లభిస్తున్న సేవలతోపాటు గృహహింస, బాల్యవివాహల నిరోధక, పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆపద సమయాల్లో మహిళలు, బాలికలు డయల్ 100, 181, 1098, 14567 వంటి టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తక్షణ సాయం పొందాలని కోరారు. టోల్‌ఫ్రీ నంబర్ల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో వీఓఏలు నారాయణమ్మ, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ కాల్వలు.. రోడ్లపై మురుగునీరు

- డ్రెయినేజీలపైనే ర్యాంపుల నిర్మాణం
- చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నల్లబెల్లి : మండల కేంద్రమైన నల్లబెల్లిలో కాల్వలు మూతపడ్డాయి. రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. ట్రాఫిక్, పారిశుధ్య సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వివిధ అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు ఇతర వాహనాల్లో వేలాది మంది రోజూ రాకపోకలు సాగిస్తారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలపై కొందరు వ్యాపారస్తులు ర్యాంపులు, షాబాదు రాళ్లతో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో స్థానికంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

రోడ్డు పొడవునా ట్రాఫిక్ సమస్య

ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మురికికాల్వలపై వ్యాపారస్తులు అక్రమంగా ర్యాంపులు, షాబాదు రాళ్లతో అక్రమ నిర్మాణ చేపట్టారు. షాపింగ్ చేసేందుకు వచ్చిన ప్రజలు వాహనాలను షాపుల ఎదుట ఇష్టారీతిన నిలుపుతుండడంతో రోడ్డుపై నడిచి వెళ్లడానికీ ఇబ్బందులు తప్పడం లేదని విమర్శలున్నాయి. అయినా సంబంధిత అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోని దుస్థితి నెలకొంది. అక్రమంగా నిర్మించిన ర్యాంపులపై వ్యాపారాలు సాగిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన షాపులకు వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్డుపైనే వాహనాలను నిలిపేసి వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు

డ్రెయినేజీ కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ఎరులైపారుతోంది. మురికి కాల్వలపై అక్రమంగా ఏర్పాటు చేసిన ర్యాంపులను తొలగించి క్రమం తప్పకుండా పారిశుధ్యం పనులు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు సక్రమ చర్యలు చేపట్టకపోవడంతో హైస్కూల్ వెనక వైపు కాలనీ నుంచి వచ్చే మురికినీరు రోడ్లపైనే పారుతోంది. దీంతో కంపు కొడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. పాదచారులకు నడక సైతం సాగించలేని దుస్థితి నెలకొంది. కాల్వల్లో మురుగునీరు చేరుతుండడంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగుకాల్వలపై చేపట్టిన నిర్మాణాలను తొలగించి కాల్వల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాల్వలు అస్తవ్యస్తం



రహదారికి ఇరువైపులా నిర్మించిన మురుగుకాల్వ అస్తవ్యస్తంగా తయారైంది. కొందరు వ్యాపారస్తులు కాలువను ఆక్రమించి ర్యాంపులు నిర్మించి వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. హై స్కూల్ దారిలో రోడ్డుపై మురుగునీరు పారుతుండడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. అక్రమ నిర్మాణాలను తొలగించి మురుగుకాల్వలను శుభ్రం చేయాలి.

– సామల రాజు, నల్లబెల్లి

జరిమానా విధిస్తున్నాం



రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపే వారిపై జరిమానా విధిస్తున్నాం. వ్యాపారస్తులకు మురుగుకాల్వపై షాపులకు సంబంధించిన సామగ్రి ఉంచకూడదు. తద్వారా వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకొంటాం. ముఖ్యకూడళ్లలో పోలీసులతో ట్రాఫిక్ నియంత్రిస్తాం.

– గోవర్ధన్, ఎస్సై, నల్లబెల్లి

పారిశుద్ధ్య పనులు చేయిస్తాం



మురుగుకాల్వలు శుభ్రం చేసే అవకాశం లేకుండా ర్యాంపులు నిర్మించి సామగ్రి పెట్టి వ్యాపారం చేయడం సరికాదు. రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వపై కొందరు షాపుల యజమానులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. మండల కేంద్రంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రవి, ఎంపీఓ, నల్లబెల్లి

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన కలకొండ లక్ష్మణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గూడ మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేలు సాయం అందజేశారు. గ్రామానికి చెందిన యువకులు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సంపత్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి నివాళి



ఐలయ్య (ఫైల్)

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన బోళ్ల అయిలయ్య శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందగా ఆయన మృతదేహానికి సీపీఐం సీనియర్ నాయకుడు పుచ్చకాయల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడైన సీపీఎం మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్యను చంద్రారెడ్డి, ఇతర నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోరబోయిన కుమారస్వామి, గోనె కుమారస్వామి, సమ్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి దుర్గయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, ముదిరాజ్ మహాసభ ఎస్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి, బాల్‌నాయక్‌తండా, ఊకల్ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి శుక్రవారం పరామర్శించారు. వెంకటేశ్వరపల్లిలో షేక్ నన్నే సాహెబ్, శివరాంతండాలో చెందిన బానోత్ హంసి, ఊకల్‌లో వల్లపు రోశయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఝాన్సీరెడ్డి పరామర్శించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

మద్రిపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని మద్రిపల్లికి చెందిన కుక్కముడి రమణకుమార్, మాస సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాగం శివాజీ, నాయకులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంట రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వనయ్య, తదితరులు పాల్గొన్నారు.